సాక్షి ప్రకాశం

శనివారం ǀ 4 ǀ జనవరి ǀ 2025

I



ఆర్టీసీని దెబ్బతీస్తే పోరాటం తప్పదు

విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దుర్మార్గమని, వెంటనే ఆ ప్రయత్నాలు విరమించుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. - IIలో..



అగ్రహారం భూముల్లో పొజిషన్ చూపాలి

గత ప్రభుత్వంలో నగరంలోని నిరుపేదలకు ఇళ్లస్థలాల కోసం అగ్రహారం వద్ద పట్టాలు ఇచ్చిన వారికి పొజిషన్ చూపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. రాత్రి చలి తీవ్రత అధికం.

న్యూస్‌రీల్

ఎస్పీ విచారణకు గైర్హాజరైన తులసీ బాబు

ఒంగోలు టౌన్: మాజీ ఎంపీ, డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు కస్టడీ కేసులో విచారణాధికారి అయిన ఒంగోలు ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా గుడివాడకు చెందిన కామేపల్లి తులసీ బాబుకు నోటీసులు ఇచ్చి ఉన్నారు. ఆయన శుక్రవారం ఎస్పీ ముందు హాజరు కావాల్సి ఉంది. అయితే ఆయన విచారణకు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాలతో తాను విచారణకు హాజరు కాలేకపోతున్నానని, ఈనెల 6, 7 తేదీల్లో హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలని ఎస్పీని కోరినట్లు సమాచారం.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వివరాలు అప్లోడ్ చేయాలి



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వాకాటి కరుణ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ చాంబర్లో జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధికారులు హాజరయ్యారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఆశా, ఏఎన్‌ఎంల ద్వారా రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి శిబిరాలకు తీసుకురావాలని చెప్పారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను అప్లోడ్ చేసేందుకు ఏదైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాంకేతిక లోపం ఉంటే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ నోడల్ అధికారి డా.భగీరథి, ఇమ్యూనైజేషన్ అధికారిణి డా.పద్మజ, డీటీసీఎస్ డా.నళిని, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, ఎపిడిమియాలజిస్ట్ విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కాషాయదళం

- హైందవ శంఖారావానికి ముందస్తుగా ఒంగోలులో భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

ఒంగోలు మెట్రో: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ గురువారం విజయవాడలో ఏర్పాటు చేసిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు సన్నాహకంగా ఒంగోలులో శుక్రవారం సాయంత్రం వందలాది మంది హిందువులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేశారు. ముందుగా పాలిమేర అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి డీజే పాటలతో జైశ్రీరామ్ నినాదాలతో కాషాయ పతాకాలు చేపట్టి ముందుకు సాగారు. త్రిపుర భైరవానంద స్వామి శంఖారావం పూరించి బైక్ ర్యాలీ ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ, నగరంలోని హైందవ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చీకటిని పారదోలుతూ.. జీవితాన్ని పరుగు పెట్టిస్తూ!

ఆత్మస్థైర్యమనే ఆయుధంతో విజయం వైపు పరుగులు తీస్తున్నారు. చీకట్లు పారదోలుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఛేదిస్తున్నారు. క్రీడల్లో ప్రతిభ చూపుతూ అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు.

- IIలో ▶

ఆకలి వేట..
జనారణ్యం బాట

వన్యమృగాలు అడవులను వదిలి జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ఆహారం, నీళ్లు దొరక్క అవి నల్లమల అభయారణ్యం నుంచి గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. మనుషులు, పశువులపై దాడులకు పాల్పడుతూ టెర్రర్ పుట్టిస్తున్నాయి. పులులు, ఎలుగుబంట్లు సంచారం అధికం కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పశువులు, మేకలు, గొర్రెలను మేత కోసం అటవీ ప్రాంతంలోకి తోలుకుని వెళ్లడానికి భయపడుతున్నారు. నీళ్ల, ఆహారం కోసం అరణ్యం వదిలి జనం వైపు వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నాయి.

- గిరిజన గ్రామాల్లోకి తరచూ పులులు, ఎలుగు బంట్లు రాక
- నిత్యం ప్రజలపై దాడులు
- 20 పైగా ఆవులు, గేదెలను చంపిన వైనం
- వేటాడుతూ రోడ్లపైకి వచ్చి మృత్యువాత పడుతున్న పులులు
- ఐదేళ్లలో 4 పులుల మృతి
- భయాందోళనలో దోర్నాల యర్రగొండపాలెం గిద్దలూరు అర్ధవీడు మండలాల ప్రజలు
- నల్లమలలో 87 పెద్ద పులులు 100 చిరుతలు



జంతువును వేటాడి తీసుకెళ్తున్న పెద్దపులి(ఫైల్)

మార్కాపురం:

ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతం జీవ వైవిధ్యానికి పుట్టినిల్లు. నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాజెక్టులో ప్రధానంగా 87కు పైగా రాయల్ బెంగాల్ టైగర్లు, సుమారు 100 కు పైగా చిరుతలు సంచరిస్తున్నాయి. ఇవికాకుండా వందల సంఖ్యలో దుప్పులు, జింకలు, నీల్‌గాయ్‌లు, ఎలుగుబంట్లు ఉన్నాయి. ఆహారం, నీళ్ల కోసం ఇవి తరచూ అటవీ సమీప ప్రాంతాలకు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వన్యప్రాణులను వేటాడుతూ జనావాసాల వైపు వచ్చేస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలు, పశువుల కాపర్లు, పొలాలకు వెళ్లే రైతులు, ఉపాధి కూలీలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. మార్కాపురానికి చుట్టుపక్కల ఉన్న పెద్దదోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, అర్ధవీడు, గిద్దలూరు తదితర మండలాల్లో ఉన్న అటవీసమీప గ్రామాల నుంచి పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గేదెలు, ఆవులు, ఎద్దులపై దాడిచేసి తింటున్నాయి. పెద్దదోర్నాల మండలంలోని బొమ్మలాపురం, వై చర్లోపల్లి, నల్లగుంట్ల, తుమ్మలబైలు, శ్రీశైల శిఖరం, ఘాట్‌రోడ్డు, అర్ధవీడు మండలంలోని గన్నెపల్లి, లక్ష్మీపురం, మాగుటూరు తాండ, వెలగలపాయ, దొనకొండ, మార్కాపురం మండలం గొట్టిపడియ, పెద్దారవీడు మండలం గుండంచర్ల తదితర గ్రామాల శివార్లలో నాలుగు నెలల వ్యవధిలో చిరుతలు, పెద్దపులులు వచ్చి 20కి పైగా గేదెలు, ఎద్దులను హతమార్చాయి. ఇదే సమయంలో గిద్దలూరు–నంద్యాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో రాత్రిపూట చిరుతలు, పెద్దపులులు వచ్చి రైలును ఢీకొని మృత్యువాత పడుతున్నాయి. ఆహారం, నీళ్ల కోసం రోడ్లపైకి వచ్చి వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. వీటితోపాటు పొలాల్లో రైతులు అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి చనిపోతున్నాయి. పెద్దపులులు, చిరుతలకు అడవిలోనే నీటి సమస్య లేకుండా సోలార్ సాసర్‌పిట్‌లు ఏర్పాటు చేసి నీటి సమస్య తీర్చారు.

బేస్ క్యాంపుల ఏర్పాటు...

నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేందుకు బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పెద్దపులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాటి కదలికల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, ఇష్టకామేశ్వరి ఆలయం, దొరబైలు, నారుతడికల, పాలుట్ల, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, కొర్రపోలు, చినమంతనాల, రోళ్లపెంట తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో ఐదుగురు అటవీ అధికారులు ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం మీద 120 మంది ప్రొటెక్షన్ వాచర్లు పులుల సంరక్షణలో ఉన్నారు.

> **వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు**
>
> 
>
> వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అడవిలోనే వాటికి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం. వన్యప్రాణులు జన వాసాల్లోకి వస్తే మాకు వెంటనే సమాచారం తెలపండి. వాటి రక్షణకు చర్యలు తీసుకుంటాం. వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. అడవిలో లోతట్టు ప్రాంతాలకు వెళితేనే పెద్దపులులు, చిరుతలు దాడులు చేస్తాయి. గడ్డికోసం పశువులను తీసుకెళ్లొద్దు లోతట్టు అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దు.
>
> – సందీప్ కృపాకర్, డిప్యూటీ డైరెక్టర్, మార్కాపురం

వన్యమృగాల దాడులు ఇలా..

- గత నెల 26, 27 తేదీల్లో అర్ధవీడు మండలంలోని మొహిద్దీన్‌పురం, నాగులవరం రోడ్డులో చిరుత సంచారాన్ని ప్రజలు గమనించారు.
- గత నెల 15న శ్రీశైలం డ్యామ్ సమీపంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది.
- 2023 డిసెంబరులో పొదిలి మండలం కంభాలపాడు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది.
- 2023 డిసెంబరు 23న దోర్నాల మండలం జమ్మిదోర్నాల వద్ద కుక్కల దాడిలో కృష్ణజింక మృతి చెందింది.
- 2023 డిసెంబరులో పెద్దదోర్నాల మండలం కొత్తూరు గ్రామంలో పశుగ్రాసానికి వెళ్లిన ఏరువ జయరామిరెడ్డిపై అడవిపంది దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది.
- 2023లో 7 గేదెలు, 2 ఆవులు, 2 ఎద్దులు వణ్యమృగాల బారినపడి మృతి చెందాయి.
- గతేడాది 5 గేదెలు, 2 ఆవులు, 3 ఎద్దులు మృతి చెందాయి.
- 2023–2024 సంవత్సరాల్లో మార్కాపురం, గిద్దలూరు పరిధిలో సుమారు 20కిపైగా పశువులను, పెద్దపులి, చిరుతపులులు దాడిచేసి చంపాయి.
- రెండేళ్లలో అడవి జంతువుల బారినపడి చనిపోయిన గేదెలు, ఎద్దులు, ఆవుల యజమానులకు సంబంధించి అటవీశాఖ అధికారులు సుమారు రూ.6 లక్షల వరకూ పరిహారాన్ని అందించారు.

ఇలా అటవీ సమీప గ్రామాల్లోని పొలాల్లో పెద్దపులి, చిరుతలు, పశువులు, మేకలు, గొర్రెలను వేటాడుతున్నాయి.



శ్రీశైలం ఘాట్‌రోడ్డులో చనిపోయిన చిరుత (ఫైల్)

చనిపోతున్న పులులు, చిరుతలు

జనారణ్యంలోకి వస్తున్న పులులు, చిరుతలు మృత్యువాతపడుతున్నాయి.

- గతేడాది అర్ధవీడు మండలం వెలగలపాయ సమీపంలో విద్యుత్ కంచె తగిలి చిరుత మృతి చెందింది.
- 2023 నవంబరు 10న శ్రీశైలం ఘాట్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతి చెందింది. అదే ఏడాది రోడ్డు దాటుతున్న ఏడాదిన్నర వయస్సున్న చిరుతపులి పిల్ల గుర్తు తెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడింది.
- 2022 జనవరి 6న దోర్నాల మండలం రోళ్లపెంట సమీపంలో బావిలో పడి చిరుతపులి మృతి చెందింది.
- 2021 నవంబరు 12న గిద్దలూరు–నంద్యాల మధ్య చలమ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు రైలుకిందపడి పెద్దపులి మృతి చెందింది.
- 2020 ఏప్రిల్‌లో యర్రగొండపాలెం సమీపంలోని గాలికొండ అటవీ ప్రాంతంలో వృద్ధాప్యంతో తీవ్రమైన ఎండ వేడిమి తట్టుకోలేక పెద్దపులి మృతి చెందింది.

నారీ..లక్ష్యం చేరి

- మహిళా పోలీసు ఉద్యోగాలకు దేహదారుఢ్య పరీక్షలు
- 194 మంది హాజరుకాగా 123 మంది రాత పరీక్షలకు ఎంపిక

ఒంగోలు టౌన్: పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలు 4వ రోజుకు చేరాయి. తొలిరోజు నుంచి పురుష అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతుండగా శుక్రవారం తొలిసారి మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం 5 గంటల నుంచి పరీక్షల ప్రక్రియ మొదలైంది. తొలుత అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్‌మెంట్ పరీక్షలు నిర్వహించారు. తదుపరి 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల లాంగ్ జంప్ వంటి ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు జరిగాయి. పరీక్షల సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా ఆర్‌ఎఫ్‌ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. 455 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 194 మంది పాల్గొన్నారు. వారిలో 123 మంది తదుపరి రాత పరీక్షలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ ఉత్సాహభరిత వాతావరణంలో పోలీసు నియామక పరీక్షలు జరుగుతున్నాయన్నారు.

ఎలాంటి పొరపాట్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని చెప్పారు. సీసీ కెమెరాలు, డ్రోన్‌ల పర్యవేక్షణలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎవరైనా సరే పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే డయల్ 112కు ఫోన్ చేయాలని, లేకుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మధ్య దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. ఈ ఈవెంట్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడిషనల్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, పీటీసీ డీఎస్పీ మాధవ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీవో ఏఓ రామ్మోహన రావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్‌లు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, రమేష్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థిని



ధ్రువీకరణ పత్రాలు నమోదు చేయించుకుంటున్న మహిళా అభ్యర్థులు



అభ్యర్థుల ఎత్తు కొలవడాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్



పరుగు పందెంలో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

సావిత్రి బాయి స్ఫూర్తితో మహిళలు పోరాడాలి

- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు

ఒంగోలు టౌన్: మహిళలకు చదువు చెప్పేందుకు ప్రాణాలకు తెగించి పాఠశాల నిర్వహించిన సావిత్రి బాయి స్ఫూర్తితో మహిళలు చైతన్యవంతులై పోరాటాల్లో పాల్గొనాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ బొట్ల సుబ్బారావు పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట మంచిపుస్తకం వద్ద శుక్రవారం బీసీ సమన్వయ కమిటీ, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. తొలుత సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ నాటి సమాజంలో మహిళల వెనకబాటుకు కారణం ఆధునిక విద్య లేకపోవడమే అని గుర్తించిన సావిత్రి బాయి దళితులు, బహుజనులకు పాఠశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. భర్త జ్యోతిరావు పూలే సహకారంతోపాటు ఫాతిమా షేక్ అనే ముస్లిం మహిళ తోడ్పాటుతో ఆమె నిమ్న జాతులకు చదువు చెప్పి విజ్ఞాన జ్యోతులుగా మలిచారని చెప్పారు. సావిత్రి బాయి జయంతి జనవరి 3వ తేదీ కాగా ఫాతిమా షేక్ జయంతి జనవరి 9వ తేదీ జరుగుతుందని, కొన్నేళ్లుగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు సావిత్రి బాయి, ఫాతిమా షేక్ జయంతి వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాజంలోని అట్టడుగు ప్రజలను చైతన్యవంతులను చేయడానికి సావిత్రిబాయి ఎన్నో అవమానాలను సహించారని, మరెన్నో దాడులను ఎదుర్కొన్నారని తెలిపారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే దంపతులు 1948లో సత్యశోధక సమాజాన్ని నెలకొల్పి స్త్రీలకు, అణగారిన వర్గాల ప్రజలకు పాఠశాలలను స్థాపించి విద్యాబోధన కొనసాగించారని తెలిపారు. జనవరి 3వ తేదీ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చుండూరి రంగారావు, టి.వెంకటస్వామి, భీమవరపు సుబ్బారావు, గుంటూరు మస్తాన్ రావు, కేవీ శేషమ్మ, తోరటి ఆనంద్, పిన్నిక శ్రీనివాస్, వీరాంజనేయులు, ఇత్తడి రవికుమార్, పరిటాల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



మంచి పుస్తకం వద్ద సావిత్రి బాయి జయంతిని నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు, బీసీ సమన్వయ కమిటీ

క్లుప్తంగా

5న సెపక్‌తక్రా జిల్లా స్థాయి జట్ల ఎంపిక

ఒంగోలు: సెపక్‌తక్రా జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక ఈనెల 5న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు యనమల సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ప్రక్రియ సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని.. వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 8309114704ను సంప్రదించాలని అధ్యక్షుడు సురేష్ విజ్ఞప్తి చేశారు. ఎంపికైన క్రీడాజట్లు ఈనెల 17,18 తేదీల్లో పొదిలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని చెప్పారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: గుర్తుతెలియని ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని దిగువమెట్ట టన్నెల్ సమీపంలో శుక్రవారం జరిగింది. సుమారు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి డోన్ నుంచి గుంటూరుకు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు నంద్యాల జీఆర్‌పీఎఫ్ సిబ్బంది గుర్తించారు. మృతుడు బ్లూ కలర్ షర్టు, నల్లప్యాంటు ధరించి ఉన్నాడు. నంద్యాల నుంచి దిగువమెట్టకు రైలు టిక్కెట్టు, దిగువమెట్ట నుంచి పచ్చర్లకు బస్సు టిక్కెట్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకున్నారు. రైలు కింద పడటం వల్ల ముఖం పూర్తిగా ఛిద్రమై గుర్తుపట్టేందుకు వీలులేకుండా పోయింది.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

పామూరు: చెక్ బౌన్స్ కేసులో చెక్కు ఇచ్చిన వ్యక్తికి కనిగిరి జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర ఏడాది జైలుశిక్ష విధించారు. వివరాలు... నంద్యాల మండలం నూనెపల్లి గ్రామానికి చెందిన పఠాన్ అబ్దుల్ కరీం ఖాన్ అను వ్యక్తి పామూరుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా నుంచి రు.7 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీని తాలూకు రూ.5 లక్షలకు చెక్కు ఇచ్చాడు. సదరు చెక్కును ఖాదర్‌బాషా బ్యాంకులో వేయగా చెక్ బౌన్స్ అయింది. ఈ కేసులో శుక్రవారం కనిగిరి కోర్టులో విచారణ జరగ్గా.. కనిగిరి జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర నిందితునికి ఏడాది జైలు శిక్ష విధించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికిత్స పొందుతున్న రాజారావు

హనుమంతునిపాడు: మండల పరిధిలో కూటాగుండ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలేకెళ్తితే.. కూటాగుండ్ల ఎస్సీ కాలనీకి చెందిన గొట్టిముక్కల రాజారావు గుడిపాటిపల్లి వైపు నుంచి స్వగ్రామం కూటాగుండ్ల తన బైక్ పై వస్తున్నాడు. గుడిపాటిపల్లి రోడ్డులో కూటాగుంట్ల ఎస్సీ కాలనీకి సమీపాన బత్తాయి తోట వద్ద బైకు అదుపు తప్పి తిరగబడింది. క్షతగాత్రుడు రాజారావుకు తలకు త్రీగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనం ద్వారా కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.

ట్రిపుల్ రైడింగ్‌తో రయ్..



ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న ఆర్‌టీఓ కార్యాలయ అధికారి

ఒంగోలు అర్బన్: ఆర్‌టీఓ కార్యాలయం అధికారులు, సిబ్బందికి మాత్రం రూల్స్ వర్తించవన్నట్లు వ్యవహరిస్తున్నారు. ట్రిపుల్ రైడ్ చేస్తున్నారని, హెల్మెట్ ధరించలేదని, వాహనాల ధ్రువీకరణ పత్రాలు లేవని ఆర్‌టీఓ కార్యాలయం అధికారులు, సిబ్బంది శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించారు. అయితే తనిఖీల్లో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యానర్థులు ముగ్గురు ఒకే బైక్‌పై వస్తుండగా వారిని పట్టుకుని జరిమానా విధించారు. అయితే జరిమానా ఇప్పుడే కట్టలేమని వారు చెప్పడంతో ఆ బైక్‌ను కార్యాలయానికి తరలించారు. జరిమానా చెల్లించి వాహనం తీసుకువెళ్లాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలున్నాయని తెలుపగా ఆర్‌టీఓ కార్యాలయం అధికారి జయప్రకాష్ విద్యార్థులను పట్టుకున్న బైక్‌ను తరలించేసమయంలో ఒక విద్యార్థిని అదే వాహనంపై తీసుకుని వెళ్లారు. మరో ఇద్దరు విద్యార్థులను ఒకే బైక్‌పై ఆర్‌టీఓ కార్యాలయం సిబ్బంది డ్రైవ్ చేసుకుంటూ ట్రిపుల్ డ్రైవ్‌లో వెళ్లాడు. ఆ దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించగా గమనించడంతో ఒకరిని దించి నడుచుకుంటూ కొంత ముందుకు వెళ్లాలని తెలిపి అక్కడి నుంచి ముగ్గురు ఒకే బైక్‌పై వెళ్లారు. ఇదంతా చూస్తున్న వాహదారులు ఆర్‌టీఓ కార్యాలయం సిబ్బందికి రూల్స్ వర్తించవేమో అంటూ నోరువెళ్లబెట్టారు.

ఉత్సాహంగా అంధుల పోటీలు



జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీం అన్సారియా

- పలు విభాగాల్లో పాల్గొన్న దివ్యాంగులు
- పోటీలను ప్రారంభించిన కలెక్టర్

ఒంగోలు వన్‌టౌన్: అంధుల ఆటల పోటీలను కలెక్టర్ ఎ. తమీం అన్సారియా శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంధుల మానసిక ఉల్లాసం కోసం, ఆహ్లాదకరంగా ఉండేందుకు ఇటువంటి ఆటల పోటీలు దోహదం చేస్తాయన్నారు. లూయి బ్రెయిలీ 216వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ హై స్కూల్‌లో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 100 మందికి పైగా అంధులు పలు పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. కార్యక్రమంలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి, మెప్మా, డీఆర్‌డీఏ పీడీ టి. రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి అర్జున్ నాయక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి యం. అంజల, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఆదిలక్ష్మి, వివిధ పాఠశాలల పీఈటీలు, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు జి. అర్చన తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పరిగెడుతున్న అంధ విద్యార్థులు



డిస్క్‌త్రో విసురుతూ..



లూయి బ్రెయిలీ జయంతి సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో షాట్‌పుట్ విసురుతున్న అంధ మహిళలు



చెస్ ఆడుతున్న క్రీడాకారులు



స్కిప్పింగ్ ఆడుతున్న అంధ విద్యార్థిని

జాతీయ వాలీబాల్ పోటీలకు నలుగురు ఎంపిక



ఎం.నాగలక్ష్మి



బి.హేమంత్



ఎం.ఈశ్వర్



బి.శ్యామ్



జి.రాధాకృష్ణ, కోచ్

- తొలిసారిగా ఇంతమంది ఒకేసారి ఎంపికవడంతో అభినందనలు

ఒంగోలు: జిల్లా వాలీబాల్ క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. ఒకే దఫా ఏకంగా నలుగురు క్రీడాకారులు ఒక్క ప్రకాశం జిల్లా నుంచి ఎంపిక కావడం ఇదే ప్రథమం. వీరిలో బి.హేమంత్, ఎం.ఈశ్వర్, బి.శ్యామ్‌లు పురుషుల జట్టుకు ఎంపికకాగా, ఎం.నాగలక్ష్మి మహిళా జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 7 నుంచి 13వరకు అడ్‌హక్ కమిటీ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి సీనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈనెల 4న జిల్లా నుంచి జైపూర్ బయలుదేరనున్న వీరిని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ ఎం.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు డాక్టర్ జి.ధనుంజయరావు తదితరులు అభినందించారు. మరో వైపు పురుష రాష్ట్ర జట్టుకు అమ్మనబ్రోలు వాసి, ప్రస్తుతం బాపట్ల క్రీడాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న కోచ్ జి.రాధాకృష్ణ ఎంపిక కావడం పట్ల కూడా వారు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తాచాటి ప్రథమ స్థానం కైవసం చేసుకునేందుకు కృషి చేయాలని జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు సూచించారు.

నూతన జీవనోపాధులతో అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఉన్నతి రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ రాజా ప్రతాప్

ఒంగోలు వన్‌టౌన్: పీఎం అజయ్ (ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన) పథకం ద్వారా నూతన జీవనోపాధులను ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతి రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జి. రాజా ప్రతాప్ అన్నారు. ఒంగోలులోని టీటీడీసీ కార్యాలయంలో పీఎం అజయ్ రుణాలు పొందేందుకు అర్హులైన 109 మంది లబ్ధిదారులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ ఉన్నతి పీడీ మాట్లాడుతూ సెర్ప్ ఉన్నతి విభాగం, ఎస్సీ కార్పొరేషన్‌లు ఈ పథకాన్ని సంయుక్తంగా అమలు చేస్తున్నాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గరిష్ఠంగా రూ. 50 వేల సబ్సిడీ, సెర్ప్ ఉన్నతి తరఫున వడ్డీలేని రుణం, లబ్ధిదారుని వాటా, ఇన్సూరెన్సు కలిపి యూనిట్ విలువ లక్ష రూపాయల నుంచి మూడు లక్షల వరకు ఉంటుందన్నారు. 37 మండలాల నుంచి 109 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి సుస్థిర జీవనోపాధుల ఏర్పాటు, ముడి సరుకు లభ్యత, నైపుణ్య అభివృద్ధి, మార్కెటింగ్ సౌలభ్యత, రుణం చెల్లింపులుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టి. రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ యాదవ్, జేడీఎం డి. రజనీ కాంత్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని దెబ్బతీస్తే పోరాటం తప్పదు



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి

ఒంగోలు టౌన్: విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దుర్మార్గమని, వెంటనే అటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అయ్యపురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే ఇవ్వాలన్నారు. ప్రైవేటు వ్యక్తులకు విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యత అప్పగించడం ఆర్టీసీ ఉనికికే ప్రమాదమన్నారు. దీనివల్ల ఆర్టీసీ సిబ్బంది తీవ్రంగా నష్ట పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కనుమరుగవుతుందని, నామమాత్రంగా ఆర్టీసీ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల వేతనాలు, హక్కులు కాలరాయడం జరుగుతుందని, ఎలాంటి సౌకర్యాలు మిగలవని చెప్పారు. ప్రయాణికులపై కూడా విపరీతంగా చార్జీల భారం పడుతుందన్నారు. ఆర్టీసీ యాక్ట్ 1950 ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 1:2 నిష్పత్తిలో ఆర్టీసీకి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు. ఏడబ్ల్యూఫ్ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకునే అవకాశం మాత్రం ఆర్టీసీకి ఇవ్వడం జరుగుతుందని, అలాకాకుండా మొత్తం విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ..ప్రైవేటు విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీపై ప్రైవేటు వ్యక్తులకు పెత్తనం అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులంతా కలిసి కట్టుగా ఈ విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. డిపో కార్యదర్శి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం భూముల్లో పొజిషన్ చూపాలి



అగ్రహారం భూములను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

- సీపీఐ డిమాండ్
- ఈనెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగరంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందని, వెంటనే లబ్ధిదారులకు ఆ స్థలాలకు సంబంధించి పొజిషన్ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా బృందం అగ్రహారం భూములను శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 200 కోట్ల రూపాయలతో 280 ఎకరాలు కొనుగోలు చేసి ఇళ్లు లేని పేదలకు పంచిందని తెలిపారు. ఒక్కొక్కరికి సెంటు చొప్పున 22 వేల మందికి అర్హత పత్రాలను కూడా పంపిణీ చేశారని తెలిపారు. అయితే కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం లబ్ధిదారుల్లో కొంతమంది అనర్హులు ఉన్నారని చెబుతూ పాత లిస్టును రద్దు చేసిందని తెలిపారు. దాని స్థానంలో కొత్త లిస్టు తయారు చేసేందుకు సమాయత్తం కావడం దారుణమని మండి పడ్డారు. ఎవరైనా అనర్హులుంటే వారి వరకే రద్దు చేయాలి కానీ.. మొత్తం లిస్టును రద్దు చేయడమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినంత మాత్రనా పేదలకు అన్యాయం చేయడం సబబు కాదన్నారు. కూటమి పాలకులు ఇచ్చిన హామీ మేరకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ఒంగోలును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో లబ్ధిదారులు, నగరంలోని ఇళ్లు లేని నిరుపేదలతో కలిసి ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. నివేశిత స్థలాల కోసం ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా నాయకులు ఆర్. వెంకటరావు, హనుమారెడ్డి, వీరారెడ్డి, ఎంఏ సాలార్, ప్రకాష్ రావు, కరవది సుబ్బారావు, శ్రీరాం శ్రీనివాసరావు, ఎం. వెంకయ్య, ముత్తని అంజయ్య, నల్లూరి మురళి, కొత్తకోల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

మేదరమెట్ల: గుర్తుతెలియని వాహనం మోపెడ్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన కొరిశపాడు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. జె.పంగులూరు మండలం రేణింగవరం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి హరికృష్ణ (29) కొరిశపాడులోని పొగాకు కంపెనీలో కూలీలకు ఉదయాన్నే టీ అందజేసి తిరిగి రేణంగివరం వెళ్తున్నాడు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం మోపెడ్‌ను వెనుక నుంచి బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో హరికృష్ణ మోపెడ్‌పై నుంచి రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతనికి తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఢీకొన్న వాహనం అక్కడ నుంచి వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మేదరమెట్లలో ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు.



హరికృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సైన్స్ ఫెయిర్‌తో సృజనాత్మకత



సేవ్ ద ఎర్త్ ప్రాజెక్టు

ఒంగోలు సిటీ:

సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు నగరంలోని ఒంగోలు పబ్లిక్ స్కూల్లో జిల్లా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ ఫెయిర్‌కు 38 మండలాల నుంచి 114 నమూనాలు ఎంపిక అయ్యాయని చెప్పారు. వ్యక్తిగత విభాగం, జట్టు విభాగం, ఉపాధ్యాయ విభాగం నుంచి సైన్స్ ఫెయిర్‌కు నమూనాలు ఎంపిక చేశామని తెలిపారు.

గొడుగుతో రెండు విధాలుగా ఉపయోగం..



గొడుగుతో బూజు కూడా దులపవచ్చు..

సాధారణంగా మనం ఇళ్లలో బూజు తుడవడానికి బూజు కర్రను ఉపయోగిస్తుంటాం. అటువంటప్పుడు ఇంట్లో ఉన్న అన్ని వస్తువుల మీద, మన తల, మీద శరీరం మీద పడుతుంది. బూజు వలన ఎలర్జీ, జలుబు, తుమ్ములు, ఆయాసం రావచ్చు, ఇల్లు శుభ్రం చేయాలంటే కష్టమౌతుంది. కానీ గొడుగును ఈ విధంగా అమర్చుకుంటే బూజు అంతా గొడుగులో పడుతుంది. మన మీద పడదు, ఇల్లు శుభ్రం చేసుకోవడం తేలికవుతుంది. పని అయిపోగానే గొడుగుగా ఉపయోగించవచ్చు.

- ఒంగోలు పబ్లిక్ స్కూల్లో జిల్లా సైన్స్ ఫెయిర్
- ప్రారంభించిన డీఈఓ కిరణ్‌కుమార్
- ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు

డిజిటల్ అంబ్రెల్లా...

డిజిటల్ అంబ్రెల్లా లో మేము వెబ్‌సైట్, యాప్ డెవలప్‌మెంట్‌తో సహ అగ్రశ్రేణి ఐటీ సేవల్లో ప్రత్యేకత కలిగిన డిజిటల్ రంగంలో మీ విశ్వసనీయ భాగస్వామిగా ఉన్నాం. అసాధారణమైన డిజిటల్ అనుభవాలను రూపొందించాలనే అభిరుచితో, మీ దృష్టిని ముందుకు నడిపించడానికి మేము అత్యాధునిక సాంకేతిక యొక్క శక్తిని ఉపయోగిస్తాం.

డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు...



డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు

బిందు సేద్యం అనేది తక్కువ నీటితో పంటలు పండిస్తే అధిక విస్తీర్ణంలో పంటలు పండించడానికి సహాయపడే పద్ధతి. బిందు సేద్యం వల్ల నీరు, డబ్బు, సమయం, వ్యయం తగ్గుతుంది. బిందు సేద్యం వల్ల మొక్కల మధ్య ఉండే వరుసలు పొడిగా ఉంటాయి. బిందు సేద్యం వల్ల మొక్కల ఉత్పత్తి ,నాణ్యత పెరుగుతుంది.

సేవ్ ద ఎర్త్...

ప్రకృతిలో మనిషి కూడా ఒక భాగం. అంతే కానీ ప్రకృతి మనిషి కోసం కాదు. మనిషి శరీరంలాగానే వాతావరణానికి కూడా బ్యాలెన్స్ అవసరం. కానీ ఆ సంతులనం నిలిపేందుకు మనిషి తన వంతుగా ఎలాంటి కృషి చేయడం లేదు.. పైగా తెలిసో తెలియకో చేస్తున్న తప్పుల వల్ల ప్రస్తుతం ఉన్న ఆ కాస్త బ్యాలెన్స్ కూడా చెడగొడుతున్నారు. క్రమపద్ధతి లేకుండా వనరులని ఇష్టానుసారంగా వాడేయడం, కాలుష్యం, అవసరం ఉన్నా లేకపోయినా వస్తువుల్ని కొనడం, వాడి పారేసే అలవాట్ల వల్ల పర్యావరణ రక్షణ కోసం ఏం చేయాలి.. ? ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మనం కొన్ని బాధ్యతాయుత అలవాట్లను అలవరచుకుందామని ప్రతినబూనుదామా.. అంటూ వివరించారు.